ఐటీ సంస్థల ఆదాయం అదుర్స్

ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ ఐటీ సంస్థలు అత్యధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 282.6 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడాది 300 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలున్నాయని నాస్కాం అంచనావేస్తున్నది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే 5.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని నాస్కాం ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తెలిపారు. ఐటీ సర్వీసెస్ కంపెనీలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, ఈ-కామర్స్ కంపెనీలు సంయుక్తంగా ఈ ఏడాది కొత్తగా 1.26 లక్షల మందికి ఉపాధి కల్పించాయన్నారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరుకున్నారు. 2024లో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు నమోదు చేసుకున్న 4.7 శాతం వృద్ధితో పోలిస్తే దేశీయ ఐటీ సంస్థలు అంతకంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసుకోనున్నట్లు పేర్కొంది. కంపెనీల ఆదాయం 4.3 శాతం ఎగబాకి 137.1 బిలియన్ డాలర్లకు చేరుకోనుండగా, బీపీఎం ఇండస్ట్రీ 4.7 శాతం వృద్ధితో 54.6 బిలియన్ డాలర్లకు, ఇంజినీరింగ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో 7 శాతం వృద్ధితో 55.6 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నది.

వాటాల అమ్మకంపై నజర్

సర్కారీ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి

సలహాల కోసం మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ కంపెనీల నుంచి బిడ్ల ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సర్కారీ బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థల్లో వాటాలను త్వరగా అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలోనే దాని సహాయార్థం ఆయా మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ కంపెనీల నుంచి దరఖాస్తులను ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) సోమవారం ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు మర్చంట్ బ్యాంకర్లకున్న ఆఖరు తేదీ మార్చి 27. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉండే దీపం.. ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్కారీ వాటాల నిర్వహణను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అయితే ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నిబంధనల ప్రకారం 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన అమలు కావడం లేదు. దీంతో వచ్చే ఏడాది ఆగస్టు 1నాటికి ఆయా సంస్థల్లో ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే మర్చంట్ బ్యాంకర్లు-సెల్లింగ్ బ్రోకర్లు.. ఏ సంస్థల్లో వాటాలను ఎంతమేర, ఏ ధరకు, ఎప్పుడు అమ్మాలన్నదానిపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వనున్నాయి.

90 శాతంపైనే

ప్రస్తుతం ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్రం వాటా 90 శాతానికిపైగానే ఉన్నది. వాటిలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (98.3 శాతం), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (96.4 శాతం), యూకో బ్యాంక్ 95.4 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (93.1 శాతం), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (86.5 శాతం) ఉన్నాయి. అలాగే ఆర్థిక సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీలో 86.36 శాతం, బీమా కంపెనీలైన న్యూ ఇండియా అష్యూరెన్స్‌లో 85.44 శాతం, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో 82.40 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వానికి వాటాలున్నాయి. కాగా, 2021-22 బడ్జెట్‌లోనే ఐడీబీఐ బ్యాంక్‌గాక, రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ప్రతిపాదించింది. ఐడీబీఐ ప్రైవేటీకరణ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతున్న విషయం తెలిసిందే.

అమ్మకానికి 24 జాతీయ రోడ్లు

ఆస్తుల నగదీకరణలో భాగంగా జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) దేశవ్యాప్తంగా 24 రోడ్లను అమ్మకానికి పెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పలు రాష్ర్టాల్లోవున్న ఈ రోడ్లకు సంబంధించి ఆస్తులను అమ్మకం ద్వారా రూ.1,863 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం పలు రాష్ర్టాల్లో వున్న 1,472 కిలోమీటర్ల జాతీయ రహదారులను గుర్తించింది. విక్రయించనున్న రోడ్ల ప్రాజెక్టులలో ఐదు మహారాష్ట్ర రాష్ట్రంలో ఉండగా, నాలుగు ఝార్ఖండ్, మూడు ఉత్తరప్రదేశ్‌లలో ఉన్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే తెలంగాణతోపాటు బెంగాల్, బీహార్ రాష్ర్టాల్లో రెండేసి చొప్పున రోడ్లు ఉండగా.. ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఒడిశాల్లో ఒక్కో రోడ్డు ప్రాజెక్టు ఉన్నాయి.

తక్కువ వడ్డీకే యూబీలో గృహ రుణాలు

ముంబై, ఫిబ్రవరి 24: రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించడంతో ఒక్కో బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ, ఇతర బ్యాంకులు రెపో రేటుతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. దీంట్లోభాగంగా యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్‌లు తమ గృహ రుణాలపై వడ్డీరేటును తగ్గించాయి. 20 ఏండ్ల కాలపరిమితితో గృహ రుణాలు తీసుకున్న వారికి ఈ రెండు బ్యాంకులు 8.10 శాతంవడ్డీకే రుణాలు అందిస్తున్నాయి. అంటే లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ రూ.843గా నిర్ణయించింది. మిగతా బ్యాంకులు కూడా ఈ స్థాయిలోనే వడ్డీరేట్లను వసూలు చేస్తున్నాయి.

గృహ రుణాలపై వడ్డీరేటు

బ్యాంక్	వడ్డీరేటు (శాతంలో)	లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ (20 ఏండ్లకు)
యూనియన్ బ్యాంక్	8.10	843
సెంట్రల్ బ్యాంక్	8.10	843
బ్యాంక్ ఆఫ్ బరోడా	8.15	846
పంజాబ్ నేషనల్	8.15	846
కెనరా బ్యాంక్	8.15	846
ఇండియన్ బ్యాంక్	8.15	846
ఎస్బీఐ	8.25	852
బ్యాంక్ ఆఫ్ ఇండియా	8.30	855
ఐడీబీఐ బ్యాంక్	8.50	868
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.75	884

హైదరాబాద్‌లో అమ్జెన్ నూతన కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): అమెరికాలోనే అతిపెద్ద బయో టెక్నాలజీ సంస్థ అమ్జెన్..హైదరాబాద్‌లో నూతన టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. రహేజా నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో రాబర్ట్ బ్రాడ్‌వే మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నూతన సెంటర్‌ను నెలకొల్పినట్లు, భవిష్యత్తులో 200 మిలియన్ డాలర్లు(రూ.1,600 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు.

ఏఐలో పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్ బాబు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత 'ఏఐ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా - క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఫైనాన్స్, ట్రేడ్, ఎంప్లాయ్ మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి రాసిన్ బేట్స్ ఆధ్వర్యంలోని బృందం శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-క్వీన్స్ లాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

ఖనిజాల ఉత్పత్తికోసం అవగాహన

క్రిటికల్ మైనింగ్ రంగంలో పరస్పర సహకారం కోసం క్వీన్స్‌లాండ్ (ఆస్ట్రేలియా)తో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంకానుంది. 11 రకాల ఖనిజాల వెలికితీతలో పరస్పర సహకారం అందించుకోనున్నాయి.

రూ.4.23 లక్షల కోట్లు ఔట్

భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

పెద్ద ఎత్తున ఆవిరైన మదుపరుల సంపద

సెన్సెక్స్ 857, నిఫ్టీ 243 పాయింట్లు క్షీణత

దెబ్బతీసిన ఎఫ్‌ఐఐ పెట్టుబడుల ఉపసంహరణ



ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాలు కొనసాగుతున్నాయి. దీంతో మదుపరుల సంపద కూడా లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోతున్నది. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 856.65 పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 75వేల మార్కుకు దిగువన 74,454.41 వద్ద ముగిసింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.4,22,983.08 కోట్లు హరించుకుపోయి రూ.3,97,97,305.47 కోట్ల (దాదాపు రూ.398 లక్షల కోట్లు) వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం కోల్పోయి 22,553. 35 వద్ద నిలిచింది.

అమ్మకాల ఒత్తిడి

ఉదయం ఆరంభం నుంచే సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సమయం గడుస్తున్నకొద్దీ మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేశారు. దీంతో నష్టాలు మరింత పెరిగిపోయాయి. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 923.62 పాయింట్లు దిగజారడం గమనార్హం. నిజానికి గత ఐదు రోజులుగా ఈక్విటీలు నేల చూపుల్నే చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు, నిఫ్టీ 406.15 పాయింట్లు క్షీణించాయి. దీంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా భారీగానే ఆవిరైపోతున్నది.

ఐటీ షేర్లు ఢమాల్

హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా తదితర ఐటీ రంగ షేర్లకు మదుపరులు దూరంగా ఉన్నారు. ఫలితంగా ఐటీ సూచీ 2.65 శాతం పడిపోయింది. జొమాటో, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఎన్టీపీసీ షేర్లు కోలుకోలేకపోయాయి. రంగాలవారీగా టెలికం 2.26 శాతం, మెటల్ 2.16 శాతం, కమోడిటీస్ 1.53 శాతం, యుటిలిటీస్ 1.42 శాతం కుప్పకూలాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.78 శాతం మేర నిరాశపర్చాయి.

ఇదీ సంగతి..

భారతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ప్రధాన కారణాల్లోకి వెళ్తే.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ముఖ్యంగా అమెరికా ఈక్విటీ నష్టాల ప్రభావం స్పష్టంగా కనిపించింది. దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ వంటి ఆసియా దేశాల సూచీలూ నిరాశపర్చాయి. అలాగే విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) అదే పనిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం కూడా దెబ్బతీసింది.

మళ్లీ 89వేలు దాటిన పుత్తడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా ధరలు పుంజుకోవడంతో దేశీయంగా పుత్తడి ధర మళ్లీ రూ.89 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.350 ఎగబాకి రూ.89,100కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత శుక్రవారం గోల్డ్ రూ.88,750గా ఉన్న విషయం తెలిసిందే. అలాగే 99.5 శాతం కలిగిన పదిగ్రాముల ధర రూ.88,700కి చేరుకున్నది. అయినప్పటికీ వెండి ధరలు నిలకడగా నమోదయ్యాయి. కిలో వెండి లక్ష రూపాయల వద్ద స్థిరంగా ఉన్నది. రాజకీయ అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తత నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

స్మార్ట్‌వాచీలకు గిరాకీ నై

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశంలో స్మార్ట్‌వాచీలకు గిరాకీ తగ్గిపోయింది. గత ఏడాది భారత్‌కు వాటి సరఫరా 30 శాతం పడిపోయిందిమరి. వినియోగదారులకు సంతృప్తికర అనుభవం లేకపోవడం, కొరవడిన కొత్తదనం తదితర కారణాలే ఇందుకు కారణమని సోమవారం కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ నివేదిక తెలిపింది. ఇది ఫైర్ బోల్ట్, బోట్, నాయిస్ కంపెనీలకు ఎదురుదెబ్బగా పేర్కొన్నది. ఫైర్ బోల్ట్ దిగుమతులు 54 శాతం పడిపోగా, బోట్ 47 శాతం, నాయిస్ 26 శాతం దిగజారాయి. నిరుడు దేశీయ స్మార్ట్‌వాచీ మార్కెట్‌లో నాయిస్ వాటా 27 శాతంగా ఉంటే, ఫైర్ బోల్ట్ 19 శాతం, బోట్ 13 శాతంగానే ఉన్నాయి. 2023లో ఫైర్ బోల్ట్ వాటా 30 శాతంగా, బోట్ వాటా 17 శాతంగా ఉండటం గమనార్హం. అయితే 2024లో టైటాన్‌కు చెందిన ఫాస్ట్‌ట్రాక్ స్మార్ట్‌వాచీల సరఫరా దేశీయ మార్కెట్‌లో 35 శాతం పెరగడం విశేషం. అలాగే రూ.20 వేలకుపైగా ధర కలిగిన స్మార్ట్‌వాచీలకూ మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని కౌంటర్‌పాయింట్ చెప్పింది.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- **అన్ని డిపోల నుంచి 255 ట్రిప్పులు**
- **ఆర్టీసీ ఆర్ఎం విజయభాను**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం వరంగల్ రీజియన్‌లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం డీవిజయభాను తెలిపారు. ప్రముఖ శైవక్షేత్రాలైన కాళేశ్వరం, వేములవాడ, పాలకుర్తి, రామప్పకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి డిపో హనుమకొండ నుంచి కాళేశ్వరానికి 30 బస్సులు, పరకాల డిపో 20 బస్సులు, వరంగల్-2 డిపో నాలుగు బస్సులు మొత్తం 54 బస్సులు, పాలకుర్తికి వరంగల్-1 డిపో 5 బస్సులు, తొర్రూరు డిపో 14 బస్సులు మొత్తం 19 బస్సులు, కురవికి మహబూబాబాద్ డిపో 41 బస్సులు, కొమురవెల్లికి జనగామ డిపో 50 బస్సులు, మెట్టుగుట్టకు హనుమకొండ డిపో 2 బస్సులు, రామప్పకు వరంగల్-2 డిపో 17 బస్సులు, పరకాల డిపో ఒక బస్సు మొత్తం 18 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మొత్తం వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి 255 బస్సు ట్రిప్పులను నడిపిస్తున్న ట్లు వెల్లడించారు. హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు వేములవాడ నడి పించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు, భక్తుల రద్దీకనుగు ణంగా కాళేశ్వరం, రామప్ప, పాలకుర్తికి బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఈ నెల 25, 26, 27 రో జుల్లో ఈ ప్రత్యేక బస్సులు ఉంటాయన్నారు. ప్రయా ణికుల సేవ కోసం హనుమకొండ బస్‌స్టే షన్, వరం గల్ బస్ స్టేషన్, వేములవాడ, కాళేశ్వరం, పాలకుర్తి, అయిన వోలు, కొమురవెల్లిలో ఆర్టీసీ సిబ్బంది ఎల్ల వేళలా అందుబాటులో ఉంటారని వివరించారు.

ప్రత్యేక బస్సుల చార్జీల వివరాలు :

హనుమకొండ నుంచి కాళేశ్వరానికి రూ.250, వేములవాడకు రూ.210, రామప్పకు రూ.140, పాలకుర్తికి రూ.90, వరంగల్ నుంచి మెట్టుగుట్టకు రూ.50, ఐనవోలుకు రూ.50, మహబూబాబాద్ నుంచి కురవికి రూ.30, జనగామ నుంచి కొమురవెల్లికి రూ.100, తొర్రూరు నుంచి పాలకుర్తికి రూ.100గా నిర్ణయించినట్లు తెలిపారు.

మిర్చి రైతుల ఆవేదన పట్టదా?

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి24: మిర్చి రైతుల ఆవేదన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం నర్సంపేటలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పడిపోతున్నాయని, అదనంగా క్వింటాల్‌కు రూ.10వేలు అందించాలన్నారు. మిర్చి ధరలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు. అనేక రకమైన తెగుళ్లు, వ్యాధులను అరికట్టడానికి రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంట పండించి మార్కెట్‌కు తరలిస్తే కనీసం గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. మార్కెట్ మాయజాలంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని చెప్పారు. అన్ని రకాల పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని, రైతులకు అండగా ఉంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిర్చి రైతుల విషయంలో చేతులెత్తేసింద న్నారు. రెండు నెలలుగా మిర్చి రైతులు మద్దతు ధర లేక అల్లాడుతున్నారని, మార్కెట్లో మిర్చిని వ్యాపారులు కొనుగోలు చేయడం లేదన్నారు. అంతర్జాతీయంగా నాణ్యతతో కూడిన మిర్చిని వరంగల్, తెలంగాణ జిల్లాల రైతులు పండిస్తున్నా మార్కెట్లో మిర్చికి కనీస మద్దతు ధర రాకపోవ డానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మిర్చి రైతుల కష్టాలు తెలియజేయకపోవడం దారుణమన్నారు. మిర్చి రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. మిర్చికి మద్దతు ధర వచ్చేలా పోరాటం చేస్తామని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

రియల్ టైం డేటా సేకరణకు ప్రత్యేక ప్రణాళిక

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 24 : సబ్‌స్టేషన్ల నుంచి రియల్ టైం డేటా ఎప్పటికప్పుడు పొందేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం కార్యాలయంలో ఆయన 16 జిల్లాలకు సంబంధించిన మీటరింగ్, రిలే, టెస్టింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ టైం డేటా సేకరణకు తొలి దశలో 100 సబ్ స్టేషన్లను గుర్తించామన్నారు. మిగితా సబ్ స్టేషన్లు దశల వారీగా పూర్తి చేస్తామన్నారు. రియల్ టైం డేటా సేకరణ మార్చి 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆశోక్‌కుమార్, సీజీఎంలు కిషన్, అశోక్, జీఎం అన్నపూర్ణ, డీఈలు సదానందం, దర్శన్‌కుమార్, హర్జి బానోత్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఫిబ్రవరి 24 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, జర్దోషి మగ్గం వర్క్‌పై 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాసరవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్లు ఉండి, తెలుగులో రాయడం, చదవడం వచ్చి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలు తీసుకొని సంస్కృతీ విహార్ టీటీడీసీ హసన్‌పర్తిలో వచ్చే నెల 5లోగా పేర్లు సమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కంప్యూటర్ సెంటర్ ప్రారంభం

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 24: న్యాయవాదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ పిలుపునిచ్చారు. సోమవారం న్యాయవాదుల సంఘం భవనంలో ఐసీఐసీఐ బ్యాంక్ వారి ఆర్థికసాయంతో నెలకొల్పిన కంప్యూటర్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, ముదస్సిర్ అహ్మద్, లాడే రమేశ్ పాల్గొన్నా రు.

పార్కును శుభ్రం చేసి.. మొక్కలకు నీళ్లు పట్టారు

'నమస్తే' కథనానికి స్పందన

జనగామ రూరల్, ఫిబ్రవరి 24: మండల పరిధి వడ్లకొండ గ్రామంలోని ప్రకృతి వనాన్ని ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్‌కుమార్ సందర్శించారు. గ్రామంలోని ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోయి అధ్వానంగా ఉండడంతో సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'నాడు అహ్లాదం.. నేడు అధ్వానం' కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో సంపత్‌కుమార్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి సిబ్బందితో శుభ్రం చేయించారు. మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టారు.

ప్రకృతి వనంలో మొక్కలకు నీళ్లు పడుతున్న సిబ్బంది

కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

సాంస్కృతిక సమ్మేళనానికి కేటీఆర్‌కు ఆహ్వానం

వరంగల్, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రిని పురస్కరించుకొని ఇండస్ ఫౌండే షన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్స్‌లో ఈ నెల 26న నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు సమ్మేళనం నిర్వాహకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి సోమవారం కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏటా ఓరుగల్లు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా మహా శివరాత్రి రోజు వేడుకలను నిర్వహిస్తున్నామని ఆయన కేటీఆర్‌కు తెలిపారు. గత ఏడాది వేడుకలో గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్, పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు, తనికెళ్ల భరణి, జేడీ లక్ష్మీనారాయణ, గంగాధర శాస్త్రి, శశిధర్ శర్మ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యాయని వివరించారు. ఈ ఏడాది నిర్వహించే ఉత్స వాలకు హాజరుకావాలని కేటీఆర్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని, తప్పకుండా హాజరవుతానని చెప్పారని రాకేశ్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది వేడుకకు చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, ఇస్కాన్ స్వామిజీ ప్రణవానంద్ దాస్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, దేశ పతి శ్రీనివాస్, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య హాజరుకానున్నట్లు వివరించారు.



అగ్గలయ్య గుట్టపై నుంచి సూర్యోదయం చేసేందుకు వెళ్లిన రెడ్డి రత్నాకర్ రెడ్డి

అగ్గలయ్య గుట్టపై సూర్యోదయం మధురానుభూతి

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 24 : నగర నడిబొడ్డున ఉన్న అగ్గలయ్య గుట్టపై నుంచి సూర్యోదయాన్ని చూడడం జీవిత కాలంలో మధురానుభూతిని మిగిల్చిందని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి అన్నారు. సూర్యోదయం చూసేందుకు కన్యాకుమారి, మారెడుమిల్లికి వెళుతున్న తరు ణంలో నగరంలోని అగ్గలయ్య గుట్టపై సూర్యోద యాన్ని తిలకించేందుకు సరైన వేదికగా ఆయన తెలిపారు. శాంతి నాథ ట్రస్ట్ సహకారంతో డిస్కవరీ బృందానికి సారథ్యం వహించిన ఆయన ఓంకార్, జితేందర్, మహేశ్, సందీప్, శ్రీకాంత్, క్రాంతి సభ్యుల బృందంతో ఆదివారం సాయంత్రం అగ్గలయ్య గుట్ట 300 మీటర్లపై వెళ్లి తూర్పు దిక్కున ఉన్న రామ లక్ష్మణుల చెట్టు వద్ద ఉన్నామని తెలిపారు. రాత్రంతా క్యాంప్ ఫైర్ వేసుకొని ఉండగా సోమవారం తెల్లవారుజామున గుట్టపై నుంచి సూర్యోదయం అద్భుతంగా కనిపించిందని తెలిపారు. ఒక వైపు నియాన్ బల్బుల వెలుగుల్లో నగరం, మరో వైపు భద్రకాళీ, సూర్యోదయం తొలి కిరణాలు పడుతున్న వేళ మనసు కేరింతలు కొట్టిందని బృందం సభ్యులు తెలిపారు. అగ్గలయ్య గుట్ట దిగుతున్న దారిలో గంటు తీర్థం గుర్తించినట్లు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. గుట్టపై చూడాల్సిన శిల్ప సంపద ఎంతో ఉందని తెలిపారు.

పోలీసు అదుపులో వైద్యుడి భార్య

నేడు అరెస్ట్ చూపించే అవకాశం

సుబేదారి, ఫిబ్రవరి 24 : నగరంలో భట్టుపల్లి రోడ్డులో నాలుగు రోజుల క్రితం వైద్యుడు సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం ఘటన దర్యాప్తులో భాగంగా పోలీసులు వైద్యుడి భార్య ఫ్లోరా మరియాను అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ సుమంత్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఇద్దరు దుండగులను పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు సంగారెడ్డిలో జిమ్ సెంటర్ ఫిట్ ట్రైనర్ శామ్యూల్‌కు వైద్యుడి భార్యకు పరిచయం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో పోలీసులు విచారణలో భాగంగా డాక్టర్ భార్యను ఆదివారం సాయంత్రం హంటర్‌రోడ్డులోని వారి నివాసంలో అదుపులోకి తీసుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ప్రత్యేక విభాగం కార్యాలయంలో మహిళా పోలీసు అధికారుల సమక్షంలో విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రధాన నిందితుడు జిమ్ సెంటర్ ఫిట్ ట్రైనర్, ఫ్లోరా మరియాకు మధ్య ఉన్న పరిచయం బంధం, వారి మధ్య ఫోన్‌కాల్స్, సోషల్ మీడియా వేదికగా సాగిన చాటింగ్స్‌పై ఇరువురిని విచారించినట్లు సమాచారం. మంగళవారం పోలీసులు నిందితుల అరెస్ట్ చూపించి, వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. కాగా, వైద్యుడి భార్య వరంగల్ నగరంలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్నది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

ఏడుగురి నుంచి రూ.2.5లక్షల చొప్పున వసూలు

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

గీసుగొండ, ఫిబ్రవరి 24: నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాచారం గ్రామానికి చెందిన హరిగొప్పుల రాహు ల్ హైదరాబాద్‌లో గ్లోబల్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నాడు. గీసుగొండ మండలం ఎలుకుర్తికి చెందిన ఇద్దరు స్నేహితులు పృథ్వీ, దీపక్ జాబ్స్ కోసం సెర్చ్ చేస్తుండగా రాహుల్ పరిచయమయ్యాడు. అధిక డబ్బులు సంపాదించాలనే ఆశతో అతడు తలా రూ.2.5లక్షలు ఇస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని వారికి చెప్పాడు. దీంతో వారు గతేడాది జనవరిలో రూ.5 లక్షలు ఇచ్చారు. వీరితో శాయంపేట మండల కేంద్రానికి ఎటుకాల నవీన్, కొడగాని సాయిపవన్, ఆత్మకూరు మండలం పెద్దాపురానికి చెందిన రాజు, టకిరే సాయికృష్ణ, సాయికుమార్ వద్ద కూడా రూ.2.5లక్షల చొప్పున వసూలు చేశాడు. వీరంద రికీ హైదరాబాద్‌లో ట్రైనింగ్ ఇస్తారని ఫేక్ కంపెనీ పేరుతో నెల రోజులు ట్రైనింగ్ ఇచ్చి కంపెనీ మూసేస్తున్నామని, డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఉడాయించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు గీసుగొండ, ఎనుమాముల, భూపాలపల్లి పోలీసులు అతడిపై చీటింగ్ కేసులు నమోదు చేసి గాలిస్తున్నారు. ఆదివారం నిందితుడు భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లిలో మేనమామ ఇంటి వద్ద ఉన్నట్లు తెలుసుకున్న సీఐ మహేందర్ ఆదేశాలతో ఎస్సై ప్రశాంత్‌బాబు పట్టుకొని గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించారు. వరంగల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

మార్కెట్‌కు ఐదు రోజుల సెలవు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 24: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి జీ రెడ్యా ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకొని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, గుమ స్తా, హమాలీ, దడువాయి కార్మికుల అభ్యర్థన మేరకు ఈ నెల 26న మహాశివరాత్రి, 27న జాగారం, 28న అమావాస్య, మార్చి ఒకటిన వారాంతపు యార్డు బంద్, 2న వారాంతపు సెలవు అని పేర్కొన్నారు. 3వ తేదీ నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయని, రైతులు నాణ్యమైన పంట ఉత్పత్తులు తీసుకొచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు